


'మీ కోసం'లో పిజిఆర్ఎస్ అర్జీల నమోదు

ప్రజాశక్తి–పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరిస్తామని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సెల్లార్ లో ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అర్జీదారులు Meekosam. ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

వడ్డించేవాడు మనవాడైతే... పని ఎలా చేసినా బిల్లే

- అడ్వాన్స్ రూపంలో 1.35 కోట్లు మంజూరు
- ఛిద్రమైన లొద్ద వాటర్ ఫాల్స్ రోడ్డు
- టెండర్ లేకుండానే కాంట్రాక్టర్‌కు అప్పగింత

ప్రజాశక్తి - పార్వతీపురం

'వడ్డించే వాడు మనవాడైతే కడ బంతిలో కూర్చున్నా అన్నీ సమకూరుతాయి' అన్న చందం ఈ వ్యవహారానికి అచ్చు గుద్దినట్లు సరిపోతుంది. అదెలా అంటే సాలూరు మండలంలోని గిరి శిఖర గ్రామం లొద్ద వాటర్ ఫాల్స్‌కు బిటి రోడ్డు మంజూరైంది. ఐదు కిలోమీటర్ల రోడ్డుకు రూ.ఆరు కోట్లు అంచనా వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నంద, పగుల చెన్నూరు రోడ్డు నుంచి లొద్ద వాటర్ ఫాల్స్ వరకు బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. జాకరవలస, మాసికవలస, చింతామల, చింతల వలస, బందపాయి, పిరిడిపాక మీదుగా లొద్ద వాటర్ ఫాల్స్ వరకు బిటి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. ప్రకృతి సుందరమైన వాటర్‌ఫాల్స్ అక్కడ ఉండడంతో పర్యాటకులను విశేషంగా ఆకర్షించవచ్చుననే ఉద్దేశంతో జిల్లా అధికారులు ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ రోడ్డు నిర్మాణానికి టెండర్ లేకుండానే ఓ బడా కాంట్రాక్టర్‌కు ఈ పని అప్పగించారు. సాధారణంగా కోట్ల రూపాయల పనిని టెండర్ ప్రక్రియ ద్వారానే కాంట్రాక్టర్‌ను ఎంపిక చేస్తారు. మరి ఈ వ్యవహారంలో ఎంత డబ్బు చేతులు మారిందో తెలియదు కానీ నామినేషన్ పద్ధతిలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు ఈ రోడ్డు నిర్మాణ పనిని అప్పగించారు. అధికారపార్టీకి చెందిన ఓ మంత్రి సిఫార్సు చేసి తనకు సన్నిహితుడైన కాంట్రాక్టర్‌కు ఈ పని కట్టబెట్టారు. ఈ వ్యవహారంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలో ఓ ఉన్నతాధికారి పాత్ర కూడా ఉంది. ఈ రోడ్డు నిర్మాణ పని ప్రారంభించి ఏడాది కావస్తున్నా ఇంత వరకు కనీసం 20శాతం కూడా పూర్తి కాలేదు. ఒక కిలోమీటర్ మేర వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. మిగిలిన నాలుగు కిలోమీటర్ల మేర కంకరతో రోడ్డు వేసి వదిలేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు చాలా భాగం కొట్టుకుపోయింది. దీంతో గిరి శిఖర గ్రామాల గిరిజనులు కాలినడకన వెళ్ళడం కూడా కష్టంగా మారింది. లొద్ద వాటర్ ఫాల్స్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తారని, తమ జీవితాలు మారిపోతాయని భావించిన గిరిజనులకు నిరాశే మిగులుతోంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మార్గం సుగమమవుతుందని ఈ ప్రాంత గిరిజనులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు నిర్మాణం మూడడుగుల ముందుకు, ఆరడుగుల వెనక్కి అన్న చందంగా తయారైంది.



వర్షాలకు కొట్టుకపోయిన లొద్ద వాటర్‌ఫాల్స్ రోడ్డు

అడ్వాన్స్ రూపంలో కోటిన్నర మంజూరు

ఆరుకోట్ల రూపాయల రోడ్డు నిర్మాణ పని నామినేషన్ పద్ధతిలో తీసుకున్న కాంట్రాక్టర్ ఆయన ఇష్టానుసారం పనులు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒక కిలోమీటరు మేర వెట్ మిక్స్ చేసి నాలుగు కిలోమీటర్ల కంకరరోడ్డు పోసిన కాంట్రాక్టర్‌కు అధికారులు సుమారు కోటిన్నర రూపాయల బిల్లు మంజూరు చేశారు. ప్రభుత్వంలో ఓ మంత్రి సిఫార్సు, గిరిజన సంక్షేమశాఖలో ఇటీవల ఎసిబి అధికారులకు చిక్కిన ఓ ఉన్నతాధికారి అండదండలు ఈ కాంట్రాక్టర్‌కు పుష్కలంగా ఉన్నాయి. అందుచేతనే గిరిజన సంక్షేమ జిల్లా స్థాయి ఇంజనీరింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లొద్ద వాటర్ ఫాల్స్‌కు పర్యాటక శోభ ఎప్పటికీ?

నియోజకవర్గంలో అత్యంత సహజ సిద్ధమైన, సుందరమైన వాటర్ ఫాల్స్ ఉన్న లొద్ద ప్రాంతానికి రోడ్డు నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఇప్పుడున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి సంకల్పంతో ఉన్నారు. లొద్దతో పాటు జిల్లాలోని అన్ని వాటర్ ఫాల్స్‌నూ పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆయన ముందుకెళ్తున్నారు. పర్యాటకాభివృద్ధికి ప్రధానమైంది రహదారి నిర్మాణం. ఇది పూర్తయితే గానీ పర్యాటక అభివృద్ధికి పరిపూర్ణత రాదు. ఇటీవల కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ లొద్ద వాటర్ ఫాల్స్‌ను సందర్శించారు. కాలినడకన నాలుగు కిలోమీటర్ల మేర నడిచి వెళ్ళి తన చిత్తశుద్ధి నిరూపించుకున్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే యోచనలో ఆయన ఉన్నారు. ఇప్పటికీ కొంతమంది యువకులు కార్తీక మాసంలో వనభోజనాల పేరిట లొద్ద వాటర్ ఫాల్స్‌కు వెళుతున్నారు. అయితే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఆ వాటర్ ఫాల్స్‌కు పర్యాటకులు చేరుకోవాల్సి వస్తోంది. జిల్లా కలెక్టర్ సంకల్పం నెరవేరాలంటే రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది.

గురుకులాల్లో సమస్యల తిష్ట

- తలుపులు లేని మరుగుదొడ్లు
- అనేక సమస్యల మధ్య విద్యా బోధన

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో కనీస వసతులు కరువవ్వడంతో విద్యార్థులు సమస్యల మధ్య విద్యాబోధన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. తలుపులు లేని మరుగుదొడ్లు, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సక్రమంగా నిధులు ఇవ్వకపోవడంతో మెనూ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు.

మండలంలోని పెదకేర్జల, కెమిశీల, యండభద్రలో బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ఉలిపిరి, కొమరాడలో బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కొమరాడలో గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలు, బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల,కెజిబివి ఉన్నాయి. ఈ పాఠశాలలన్నింటిలోనూ అరకొర వసతులే ఉన్నాయి. నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించు కోవడంలేదు. పెదకేర్జల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సరిపడిన తరగతి గదులు, డార్మెటరీ వంటి సదుపాయాలు లేకపోవడంతో ఉన్న పాత భవనంలోనే విద్యార్థులు ఉంటున్నారు. భవనాలు పూర్తిగా శిథిలావ్యవస్థకు చేరడంతో స్లాబ్ పెచ్చులు పడిపోయి ఇబ్బందులు బితుకు బితుకు మంటూ చదువులు సాగిస్తున్నారు. ఒకే గదిలో చదువుకోవడం, నిద్రించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాలలో కూడా సౌకర్యాలు పూర్తిగా లేవు. ఈ పాఠశాలలో 300కు పైగా బాలికలు చదుతున్నారు. వీరికి సరిపడా డార్మెటరీ గాని, మరుగుదొడ్లు గాని లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో తరగతులకు కూడా సకాలంలో వెళ్లలేకపోతున్నారు. ఎండబద్ర, కొమరాడ ఆశ్రమ పాఠశాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఆశ్రమ పాఠశాలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఆర్‌ఒ ప్లాంట్‌లు పూర్తిగా పనిచేయకపోవడంతో బోరుల నుంచి వస్తున్న నీరు తాగి తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. మరమ్మతులకు గురైన ఆర్‌ఒ ప్లాంట్లను బాగు చేసేందుకు నిధులు లేవు. ఎండభద్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలో వాటర్ ట్యాంక్ చిన్నది కావడంతో విద్యార్థుల అవసరాలకు, వంట కోసం సరిపడా నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. బోరు సదుపాయం లేకపోవడంతో దూరంగా ఉన్న గెడ్డ నుంచి మోటార్ సహాయంతో నీరు రప్పిస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే.నీరు వస్తుంది. మిగతా సందర్భాల్లో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పడుతున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉండడంతో వర్షాలు పడిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. డార్మెటరీ గదుల్లో ఫ్యాన్లు, కిటికీలు లేకపోవడంతో దోమల బారిన పడి అనారోగ్యాలకు గురవుతున్నామని విద్యార్థులు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో కూడా సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే బాలుర గురుకుల పాఠశాల ఉండడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు పలుమార్లు అధికారుల దృష్టిలో పెట్టినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.



శిథిలావస్థలో ఎండబద్ర ఆశ్రమ పాఠశాల



తలుపులు లేని కిటికీలు

జన సమూహాల వద్ద పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మతపరమైన, లౌకిక, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల ద్వారా జరిగే అన్ని రకాల పెద్ద సమావేశాలు, బహిరంగ కార్యక్రమాల్లో ఎటువంటి జననష్టం, ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జన సమూహం ఉన్న చోట సమర్థవంతమైన క్యూ నిర్వహణను ఏర్పాటు చేసి నియంత్రణా చర్యలను పటిష్టంగా అమలుచేయాలని అన్నారు. అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి, పలు కార్యక్రమాలు సున్నితమైన నిర్వహణ కొరకు పోలీసు బలగాల నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమాలు జరిగే ప్రదేశాలలో ప్రజల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని, తగినంత మంది పోలీసు సిబ్బందిని (మహిళా సిబ్బందితో సహా) విధిగా నియమించాలని అన్నారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పటిష్టమైన, సరైన బారికేడింగ్ ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా గుర్తించి, విస్తృతమైన మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రాంతాలను కార్యక్రమం ప్రదేశానికి దూరంగా ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల వద్ద రద్దీని నివారించడానికి తగినంత సిబ్బందిని కేటాయించాలన్నారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, ఫైర్ సర్వీసెస్, వైద్య ఆరోగ్య శాఖలు నిర్వాహకులు నిరంతరం సమన్వయం చేసుకుని భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని సూచించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా సమావేశాలు జరిగే అవకాశం ఉన్నందున ఆయా జాబితాను తయారు చేసి, జాబితా ఆధారంగా, భద్రతా ప్రణాళికలను ముందుగానే రూపొందించి, ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఎఎస్‌పిగా మనీషా వంగలరెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం సబ్ డివిజన్ అడిషనల్ ఎస్‌పిగా మనీషా వంగల రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లాకు చెందిన ఈమె గ్రేహౌండ్స్ అస్టాల్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎఎస్‌పిగా పనిచేసిన అంకిత సురానా సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లారు.



ఎండిఎం ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

స్మార్ట్ కిచెన్ వ్యవస్థ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ఆలోచన విరమించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు కె.రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్లుగా మధ్యాహ్న భోజనాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. అందులో భాగంగానే మున్సిపల్, పట్టణాల్లోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దుచేసి ఒకే చోట స్మార్ట్ కిచెన్ పేరుతో పాలకొండ నగర పంచాయతీ పరిధిలో సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. పాలకొండ మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 5వేల మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గత 20ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వహకులు సేవా దృక్పథంతో ఈ పథకం నిర్వహిస్తున్నారని, లక్షల రూపాయలు ముందస్తు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తుంటే వారికి నష్టం చేకూర్చేలా ప్రభుత్వం ఆలోచించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీరందరికి కనీస వేతనాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా ఈ రకంగా ఉన్న ఉపాధిని తీసేయడం అత్యంత నీచమైన చర్యని అన్నారు. మహిళలను ఉద్ధరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇలా మహిళలకు ద్రోహం చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి వారి వద్ద నుంచి లక్షల్లో కమీషన్లు తీసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు చేస్తున్న కుట్రని విమర్శించారు. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు చిన్నమ్మడు, ఎస్ గౌరీశ్వరి, కె.జయమ్మ, బి.కరుణమ్మ, బి.లక్ష్మి, సిహెచ్ సత్తమ్మ, గంగమ్మ, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పాఠశాలల్లో 20ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అందులో భాగంగానే ప్రతి మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దుచేసి మండలానికి ఒక చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఈ ప్రయత్నాలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశంలో వారు మాట్లాడారు. వేలాది మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఈ విధానం అమలు చేస్తే పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న ఉపాధిని తీయడం అత్యంత నీచమైన చర్యని అన్నారు. మహిళలను ఉద్ధరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇలా మహిళలకు ద్రోహం చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ విధానాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, దీనిపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి సుశీల, మాలతి, నాయకులు తోయక జయమ్మ, కోలక కల్పన, హైమావతి, సుజాత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

తొక్కిసలాట ఘటన దురదృష్టకరం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం మనసును కలచివేసిందన్నారు. మీతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి, అత్యవసర చర్యలు చేపట్టిందన్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తక్షణమే తరలించి, తగిన వైద్య సేవలు అందించడానికి ఏర్పాట్లు చేశారని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా బాధితులను ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ఆలయం ప్రభుత్వ ఆధీనంలో గానీ, దేవాదాయ శాఖ నియంత్రణలో గానీ లేని ప్రైవేట్ వ్యవస్థ ఆధ్వర్యంలో నడుస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ నిర్వాహకులు ప్రభుత్వ యంత్రాంగానికి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, భారీ జనసందోహం ఉన్నప్పటికీ అవసరమైన భద్రతా ఏర్పాట్లు, సరైన చర్యలు చేపట్టకపోవడం, ఆలయ కమిటీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిందని ఆమె తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఆమె తెలిపారు. ఈ విషాదాన్ని రాజకీయంగా వాడుకోవాలనే ప్రయత్నాలు గర్హనీయమన్నారు. కార్తీకమాసం సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

గుమ్మలక్ష్మీపురం : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ లో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, క్యూలైన్లను క్రమబద్ధీకరించింది. ప్రమాదం జరిగిన దేవాలయం పూర్తిగా ప్రైవేటు నిర్వహణలో నడుస్తోంది. ఈ ఆలయం ప్రభుత్వ ఆధీనంలో గానీ, దేవాదాయ ఆధీనంలో కూడా లేదు. కార్యక్రమానికి సంబంధించి నిర్వహకులు ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం కూడా ఇవ్వలేదని అన్నారు. దేవాలయం కమిటీ సభ్యులు పోలీస్ వారికి ప్రొటెక్షన్ ఇవ్వాలని చెప్పి లెటర్ పెట్టుకుని ఆ తర్వాత కూడా పట్టించుకోకపోతే అప్పుడు ప్రభుత్వాన్ని నిందించాలని అంతేకాక ప్రభుత్వం తప్పు లేకుండా జరిగే ప్రమాదాలకు కూడా వైసిపి శవ రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు


ప్రయివేటు వైద్య కళాశాలలతో పేదలకు నష్టం

కోటి సంతకాల సేకరణలో మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి -సాలూరు

ప్రయివేటు వైద్య కళాశాలలతో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు తీరని నష్టం జరుగుతుందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. ప్రయివేటు వైద్య కళాశాలల ఏర్పాటుకు నిరసనగా వైసిపి చేపడుతున్న కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా ఆయన ఆదివారం పాచిపెంట మండలంలోని పాంచాలిలో సంతకాల సేకరణ చేపట్టారు. శనివారం సాలూరు మండలంలోని బూతాడ, కర్రివలసలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను అప్పటి సిఎం జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేయించారని చెప్పారు. వీటిలో 7 వైద్య కళాశాలలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందని చెప్పారు. దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య, వైద్యసేవలు దూరమవుతాయని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నడూ ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలను రాష్ట్రానికి తీసుకురాలేదని చెప్పారు. పేదలకు ఉచిత కార్పొరేట్ స్థాయి వైద్యమందకుండా చేయాలనే ఉద్దేశ్యంతోనే టిడిపి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని, కోటి సంతకాల ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 11న సాలూరులో నిర్వహించనున్న భారీ ర్యాలీకి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో పాచిపెంట మండల వైసిపి సీనియర్ నాయకులు సలాది అప్పలనాయుడు, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ తీసుకొస్తున్న జీవోను తక్షణమే రద్దుచేసి మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడిపించాలని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నంగిరెడ్డి శరత్ బాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండలం లోని రాజ్యలక్ష్మీపురంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుట్రపూర్తి రాజకీయాలు చేసి పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం దూరం చేయడమే లక్ష్యమన్నారు. పిపిపి విధానం ద్వారా నిజమైన నిరుపేదలకు విద్య, వైద్యందనివ్వకుండా చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భోకం శ్రీనివాసరావు, పలువురు వైఎస్‌పి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.




ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న రాజన్నదొర

ఆ పొజిషన్ సర్టిఫికెట్ నేను ఇవ్వలేదు

తహశీల్దార్ బాలమురళీకృష్ణ
పీతలబంద ఆక్రమణలపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల పీతల బందులో పొజిషన్ సర్టిఫికెట్‌ను గతంలో పనిచేసిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ ఇచ్చారని 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అసలు అక్కడ ఏం జరుగుతుందని నాయకులు, ప్రజలు చర్చించుకోవడం మొదలైంది. గతంలో పనిచేసిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ పొజిషన్ సర్టిఫికెట్ తాను ఇవ్వలేదని 'ప్రజాశక్తి'కి ఫోన్ చేసి స్పష్టం చేశారు. ఎవరిచ్చారనేది తాను కూడా పరిశీలిస్తానన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి పీతలబందలో పొజిషన్ సర్టిఫికెట్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీనిపై సర్వే చేయించి బందను కాపాడుతామన్నారు. అయితే ఈ పొజిషన్ సర్టిఫికెట్ ఎవరిచ్చారనేది పాలకొండలో తీవ్ర చర్చ జరుగుతుంది. అయితే ఈ పొజిషన్ సర్టిఫికెట్ 'ప్రజాశక్తి'కి చిక్కింది. ఇది ఎవరిచ్చారు అనేది వారే తెలుసుకోవాల్సి ఉంది.



Rc.No. 930 /2023/B/Dt.03.10.2023 Tahsildar's Office, Palakonda

POSSESSION CERTIFICATE

As per the record of enquiry placed before me by the Mandal Revenue Inspector Palakonda, the inheritance Property in Sy.No 479-1 for an extent of Ac.0.01¼ cents (56.66 Sq.yds) Open Place in Bayagattu Veedhi, Palakonda Nagara Panchayiti is under possession of Sri. Hanumanthu Sankara Rao S/o Sangamesu Late. The above place covered under the following boundaries.

East	:	Hanumanthu Haranadha Rao Rasta
West	:	Marukurthi Guramma Vacant site
North	:	Hanumanthu Sankararao Vacant site
South	:	Hanumanthu Ramu Vacant Site

TAHSILDAR PALAKONDA

To,
Sri. Hanumanthu Sankara Rao
S/o Sangamesu Late
Bayagattu Veedhi
Palakonda Nagara Panchiyiti
Palakonda Mandal

గత తహశీల్దార్ జారీ చేసిన పొజిషన్ సర్టిఫికెట్

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజావక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన చింత దుర్గారావు రూ.1,48,427, ఇదే మండలం ఆర్‌బిఆర్ పేటకు చెందిన తాడేల గోవిందరావుకు రూ.46,087 చెక్కులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య ఖర్చుల కోసం ఏ విధమైన ఆధారం లేని వ్యక్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని పులిగుమ్మి మీదుగా బందలుప్పి వరకు నాబార్డు కింద మంజూరైన రూ. 3.10 కోట్లతో చేపట్టాల్సిన తారు రోడ్డు పనులకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు నాలుగు తారురోడ్లు మంజూరు కాగా, అందులో రెండు రోడ్లకు రూ.7.5కోట్ల నిధులు మంజూరు చేయించి పార్వతీపురం మండలానికి ఈ రెండు రోడ్లు కేటాయించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన రెండో రోజు నుంచే అభివృద్ధి, సంక్షేమ పథకాల వైపు అడుగులు వేశారన్నారు. దీన్ని ఓర్వలేని వైసిపి నాయకులు రోడ్లపైకి వచ్చి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో చేరువలో ఉన్నాయన్నారు. ప్రజలకు కావాల్సిన అన్ని వనరులు ఈ ప్రభుత్వ హయాంలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు సహకరిస్తే విశాఖను ప్రధాన కేంద్రంగా చేసి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెగ్యులర్ సిబ్బంది లేక గాడి తప్పుతున్న పాలన

- పట్టించుకోని పాలకవర్గం
- దృష్టిసారించని స్థానిక ఎమ్మెల్యే
- పనిభారంతో అవస్థలు పడుతున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ల్లా ప్రధాన కేంద్రమైన పార్వతీపురం మున్సిపాలిటీ గ్రేడ్-1గా ఎదిగినప్పటికీ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో పాటు పలు విభాగాల్లో రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో పాలన గాడి తప్పుతుంది. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించి మూడున్నర ఏళ్లు అయినప్పటికీ గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న మున్సిపల్ కార్యాలయంలో ఏడాదిగా రెగ్యులర్ కమిషనర్‌తో పాటు, పలు విభాగాల్లో ఉద్యోగుల ఖాళీలు భర్తీ కాకపోవడంతో పాలన గాడి తప్పడమే కాక, కార్యాలయంలో ఉన్న పలు విభాగాల్లో జవాబుదారీతనం లేకుండా పోతుందన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి వెల్లు వెత్తుతున్నాయి. పార్వతీపురం పక్కనే ఉన్న బొబ్బిలి, సాలూరు మున్సిపాలిటీల్లో ఉన్న ఆయా విభాగాల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మికుల నియామకం పూర్తిస్థాయిగా ఉండడంతో ఆ మున్సిపాలిటీల్లో పాలనా వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతున్నాయి.

టౌన్ ప్లానింగ్ విభాగం

ముఖ్యంగా మున్సిపాలిటీకి దండిగా ఆదాయాన్ని తెచ్చి పెట్టే విభాగం టౌన్ ప్లానింగ్ విభాగం. ఈ విభాగంలో టిపిఒ పోస్ట్‌తో పాటు 4 గురు టిపిబిఒలు, టౌన్ ప్లానింగ్ సర్వేయర్, ట్రేసర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. జిల్లా కేంద్రంగా ఉన్న పట్టణం త్వరితిగతిన విస్తరిస్తున్నందున అన్ని వార్డుల్లో అనధికార, అక్రమ నివాస, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు బరితెగించి జోరుగా సాగుతున్నాయి. ఈ అనధికార నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు, సిబ్బంది టౌన్ ప్లానింగ్ విభాగంలో లేకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది. నిర్మాణాలతో పాటు, లేఔట్ల అనుమతులకు సంబంధించి టౌన్ ప్లానింగ్ విభాగంలో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ పోస్టులు భర్తీ కాకపోవడం వల్ల నూతన భవన నిర్మాణాలు చేసుకునే యజమానులు వాటి అనుమతుల విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విభాగానికి సంబంధించిన విధులను సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు చూస్తుండడం గమనార్హం. ఒక్కొక్క ప్లానింగ్ సెక్రటరీ నాలుగు సచివాలయాలకు సంబంధించి 8 వార్డుల్లో ఇన్చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో తమపై పని ఒత్తిడి పడుతుందని సంబంధిత సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకౌంటెంట్ విభాగం

ఇక అకౌంటెంట్ విభాగంలో ఒక్క జూనియర్ అకౌంట్ ఆఫీసర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు సీనియర్, జూనియర్ అకౌంటెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని గత కొన్నేళ్లుగా భర్తీ చేయకపోవడం వల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ బిల్లులు చెల్లింపులు, వాహనాల ఆయిల్ బిల్లులు, సి బిల్లులు, కార్యాలయానికి సంబంధించిన జమా ఖర్చుల వివరాల పద్దుల అకౌంటుకు సంబంధించి జెఎఒ ఒక్కరే విధులు నిర్వహిస్తుండడంతో అతనిపై పని భారం అధికమవుతుంది.

ప్రజారోగ్య విభాగం

పట్టణ విస్తీర్ణం, జనాభా శరవేగంగా పెరుగుతుంది. పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో నివాస గృహాల నుంచి వాణిజ్య సముదాయాల నుండి రోజుకు 25 టన్నుల చెత్త సేకరణ చేయాల్సి ఉంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగలేదు. దీనితో కార్మికులకు పారిశుధ్య నిర్వహణ కష్టతరమవుతోంది. మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, జనాభాకు తగ్గ సేవలు అందించడంలో విఫలమవుతున్నారని చెప్పవచ్చు. ప్రజారోగ్య విభాగంలో శానిటరీ ఇన్స్పెక్టర్, శానిటరీ సూపర్వైజర్, 36మంది పర్మినెంట్ పిహెచ్ వర్కర్ల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టడం లేదు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగాల్సి ఉన్నప్పటికీ గత పదేళ్లుగా కొత్త కాంట్రాక్ట్ కార్మికుల నియామకం చేపట్టకపోవడంతో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కూడా పూర్తిస్థాయిలో జరగడం లేదు .

ఇంజినీరింగ్ విభాగం

ఇంజినీరింగ్ విభాగంలో ముగ్గురు డిఇలకు గాను ఇద్దరే ఉన్నారు. మూడో డిఇ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ విధులను సచివాలయ ఇమినిటీ కార్యదర్శి నిర్వహిస్తుండడం గమనార్హం. ఇంజినీరింగ్ విభాగంలో రెండు వర్క్ ఇన్స్పెక్టర్ పోస్టులు ఎన్నో ఏళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. అభివృద్ధి పనులు జరిగే సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ చేయిస్తున్న పనుల నాణ్యత ప్రమాణాలను చూసే క్వాలిటీ కంట్రోల్ చూసేవారే లేరు. ఈ పనులు జరిగే సమయంలో ఏమాత్రం అనుభవంలేని ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న కాంట్రాక్ట్ సిబ్బంది పర్యవేక్షణతో జరుగుతుండడంతో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చి పనులు చేస్తున్నారని విమర్శలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగంలో అంచనాకు మించి ప్రతిపాదనలు చేస్తూ సిబీ బిల్లులు పెట్టి చెల్లింపులు జరుగుతున్నాయని ఆరోపణలు కార్యాలయంలో వినిపిస్తున్నాయి.


అధికారుల పర్యవేక్షణ లేక పట్టణంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు

పరిపాలన విభాగం

కార్యాలయంలో మొత్తం మీద సీనియర్ అసిస్టెంట్లు నిర్వహించాల్సిన విధులను జూనియర్ అసిస్టెంట్లు విధులను నిర్వహించడం కార్యాలయంలో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో పాటు కార్యాలయంలో పలు విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయానికి వచ్చామా, వెళ్లామా అన్న చందంగా వ్యవహరిస్తున్నారని, కార్యాలయానికి పనివేళల సమయానికి రావడంలేదని విమర్శలు మిగతా ఉద్యోగుల నుండి బలంగా వినిపిస్తున్నాయి.

మరికొన్ని నెలలలో మున్సిపల్ ఎన్నికలు జరిగేందుకు అవకాశం ఉంది కాబట్టి, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దృష్టి సారించి, మునిసిపల్ కమిషనర్‌తో పాటు, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న అన్ని విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమించి పాలనను గాడిలో పెటాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


విద్యార్థులతో కలిసి మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, అప్పుడే రాష్ట్ర, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడానికి వీలుంటుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని భద్రగిరి పిటిజి బాలికల పాఠశాలలో ఆదివారం ముంబై వేదికగా జరుగుతున్న మహిళల క్రికెట్ వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను విద్యార్థినులతో కలిసి వీక్షించారు. ఫైనల్లో ఇండియా టీం గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన జోష్‌లో ఉన్న టీమిండియా ఫైనల్ మ్యాచ్‌లోనూ గెలిచి తొలి ప్రపంచ కప్పును ముద్దాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, పాఠశాల ప్రధానాచార్యులు, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.


ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

ఎర్రన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి - సీతంపేట

కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుకు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో యర్రన్నాయుడు 13వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమం అనంతరం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శనివారం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారికి ప్రార్థిస్తూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర కుంబి, ఎఎంసి డైరెక్టర్లు సవర మంగయ్య, మూల మోహన్ రావు, మాజీ ఎంపిటిసి జయలక్ష్మి, సవర కూర్మారావు, భాస్కరరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

కిచ్చాడలో పారిశుధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడ పంచాయతీలో సర్పంచ్ జి.రాజ్యలక్ష్మి ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంథా తుఫాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లో నిండిన చెత్తాచెదారం, పూడికలను తీయించి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. అలాగే అన్ని తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించి ప్రజలకు వేడినీరు తాగాలని సూచించి వ్యాధుల బారినపడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం అందులో కార్తీకమాసం కావడంతో పర్యాటకులతో అడ్వెంచర్ పార్క్ పోటెత్తింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆల్ట్రన్ వెహికల్‌లో చుట్టుముట్టారు. ఫైవ్ డి థియేటర్ వీక్షించారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు సాహసోపేతమైన క్రీడ నిర్వహించారు.అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు వెంటనే కౌలు రైతులకు జమ చేయాలని, కొత్త కౌలు చట్టము తీసుకురావాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని కౌలు రైతులంతా కదలి రావాలని ఆయన ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

560 లీటర్ల సారాతో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్


పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు సారా, వాహనాలు

560 లీటర్ల నాటు సారా, ముగ్గుర్ని అరెస్ట్ చేసి, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయం అధికారులు ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఇఎస్‌టిఎఫ్, విజయనగరం ఎన్ఫోర్స్మెంట్ బృందాలు సంయుక్తంగా కొమరాడ మండలం గుమడ సమీపాన సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేస్తూ, మరో ఏడుగుర్ని రెండు కేసుల్లో ముద్దాయిలుగా నమోదు చేసి, 560 లీటర్ల నాటుసారా మరియు 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడులలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రి, విజయనగరం ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది ఆర్.చంద్రకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రమైన బలిజిపేటలో ఎక్కడికక్కడ వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో మండలంలో పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కుక్కల స్వైరవిహారంతో భయాందోళన చెందుతున్నారు. ప్రతిరోజు కాలేజీలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, అధికారులు భయాందోళన చెందుతున్నారు. కావున అధికారులు స్పందించి వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేయించి వాటి నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రధాన వీధిలో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు

గర్భిణుల వసతిగృహాల సేవలు మెరుగుపరచాలి : ఐద్వా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతి గృహ సేవలను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని, సిబ్బందిని శాశ్వత ప్రాతిపదిక నియమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి, మండల కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని ఐద్వా బృందం సందర్శించి అక్కడ సేవలు అందుతున్న తీరును గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, సాలూరులో విజయవంతంగా నిర్వహిస్తున్న ఈ వసతి గృహాల సేవల పట్ల ఇటీవల ఐటిడిఎ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా పార్వతీపురం ఐటిడిఎకు ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ వసతి గృహాల నిర్వహణకు నిధులు కేటాయించి శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సేవలు కొనసాగించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో రోడ్డు, వైద్య వైద్య సౌకర్యాలు అందక గిరిజన మహిళలు, గర్భిణులు, బాలింతలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మహిళలకు కొంత ఉపశమనంగా ఉన్న ఈ వసతి గృహ సేవలను మెరుగుపర్చి, చేసి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వసతి గృహాల్లో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఐటిడిఎ అధికారులను త్వరలో కలిసి చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మాలతి, బిడ్డిక దివ్య మండంగి భారతి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.రమణ, బి ఆడితు తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఐద్వా నాయకులు

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

వరుస తుఫానుల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద గిరిజన రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుస తుపాను వల్ల భారీ వర్షాలు పడడంతో చేతికి అందిన వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, బొప్పాయి, అరటి, జీడి వంటి పంటలకు బాగా నష్టం జరిగిందని తెలిపారు. అలాగే పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకెళ్లే మార్గంలో గొయ్యిలన్నీ నీటితో నిండిపోవడంతో అనేకమంది వాహనదారులు ఈ గొయ్యిలో పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని అన్నారు. కావున వెంటనే దెబ్బతిన్న రోడ్లుకు వెంటనే మరమ్మతులు చేపట్టి వాహనదారులకు, ప్రయాణికులకు భరోసా కల్పించాలని కోరారు. చేతికి అంది వచ్చిన పంటలు నేలపాలవ్వడంతో రైతులు అప్పుల పాలై లబోదిబోమనే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో వాహనదారులు, ప్రయాణికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రైతులు


ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

గణిత ప్రతిభా పరీక్షకు 213 మంది హాజరు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల (బాలుర)లో సిక్కోలు గణిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షకు 8, 9, 10 తరగతుల నుంచి 213 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రతినిధులు తెలిపారు. పదో తరగతి నుంచి ప్రథమ స్థానంలో కత్తులకవిటి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.చైతన్య, ద్వితీయ బిటివాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బి.విజయ, తృతీయ స్థానం నీలానగరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.కుమారస్వామి ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు స్థానం వీరఘట్టం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.జస్వంత్, టి.జగదీష్, తృతీయ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బి వెంకటేశ్వర ఎంపిక అయ్యారు. అలాగే 8వ తరగతిలో ప్రథమ స్థానం తెట్టంగి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బి.మనోజ్, ద్వితీయం నడుకూరు ఎంపియుపి పాఠశాలకు చెందిన జి.సూర్య, తృతీయ స్థానం నర్సిపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.శరణ్య ఎంపికయ్యారు. 8,9,10 తరగతిలో నీలానగరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షకు ఎంపికవ్వడం పట్ల ఎంఇఒ -2 ఆర్.ఆనందరావు అభినందించారు. అంతకుముందు మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష పేపర్‌ను ఆనందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సిక్కోలు గణిత సంఘం ప్రతినిధులు ఎస్ సతీష్, బివి నాయుడు, జి.శ్రీనివాసరావు, టి.నగేష్, కె.శివప్రసాద్, గౌరీశ్వరి, ఎంఎల్ఎస్ నాయుడు, బి.వాసుదేవరావు, పి.శ్రీనివాస్, అశోక్ కుమార్, ఉమామహేశ్వరరావు, వై సతీష్, అక్క రాజు, యు రవి, అప్పలనాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గౌర్నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

బాబు పాలనలో ప్రజలకు భద్రత కరువు : వైసిపి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలకు భద్రత కరువైందని వైసిపి నాయకులు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ అధ్యక్షతన పట్టణంలో బెలగాం ఆర్టీసీ కూడలి వద్ద ఉన్న వైఎస్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన, ర్యాలీ ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ, నిన్న కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన తొక్కిసలాటలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం మనందరినీ కలిచివేసిందన్నారు. రాష్ట్రంలో ఉన్న పోలీసు, ఇంటెలిజెన్స్ విభాగాలను పూర్తిగా రాజకీయ కక్షసాధింపులకు వాడుకుంటున్న చంద్రబాబు ప్రజల భద్రతనే కాదు, ఈ రకంగా ఆలయాలకు వస్తున్న భక్తుల భద్రతను కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. ఏకాదశి సందర్భంగా భక్తులు వస్తున్నారని తెలిసినా ఆలయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలపై పెట్టిన దృష్టిని రాష్ట్రంలో భక్తులకు భద్రత కల్పించే విషయంపై దృష్టి సారిస్తే మంచిది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిట్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలా సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గుణ్ణేశ్వరరావు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు సర్విశెట్టి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్ కుమార్, ఎడ్ల త్రినాధ, వండాన నేతాజీ, వివిధ గ్రామాల సర్పంచులు పెండ రమణ, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తూనే, మరొక పక్క ఎవరైనా కష్టకాలంలో ఉన్నా, పేదరికంతో బాధపడుతున్నా వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారి వివరాలను సేకరించి, అలాంటి వారికి ప్రతి నెలా తన జీవితంలో కొంత నగదును వెచ్చించి వారికి ఆర్థికంగా సహాయం చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం హెచ్‌సి కృష్ణమూర్తి పట్టణంలో వేమకోటి వారి వీధిలో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న గొర్లి, ఈశ్వర భగవాన్ (27) కు వైద్య ఖర్చులు కోసం రూ.5వేలు అందజేశారు. అలాగే ఇటీవల స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పార్సిల్ కౌంటర్‌లో జరిగిన బాంబు పేళుళ్లలో తీవ్ర గాయాలపాలై కర్షక మహర్షి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆర్‌టిసి కళాసీ రెడ్డి రమేష్‌కు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తికి ఆయా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పట్టణంలో పలువురు ప్రముఖులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమాల్లో ఈశ్వర భగవాన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సొండి గోపి, ఆర్టీసీ కళాసీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాగోలు భానుమూర్తి, ఎం.అప్పలనాయుడు, నీలరాజులు పాల్గొన్నారు.

బాధితునికి తూర్పు కాపు సంఘం ఆర్థిక సాయం

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గత నెలలో కార్గో పార్సెల్ సర్వీస్ సెంటర్ వద్ద జరిగిన బాంబు పేలుళ్లలో తీవ్రంగా గాయపడిన రెడ్డి రమేష్‌కు మెరుగైన వైద్యం కోసం పట్టణానికి చెందిన తూర్పు కాపు పెద్దలు, ఉద్యోగులు, యువత అంతా ఏకతాటిపై అన్ని వర్గాల వారి నుంచి సేకరించిన రూ.1 లక్ష 70 వేలు నగదును ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ నగదుతో పాటు మూడు నెలలకు సరిపడే నిత్యావసర వస్తువులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ బాధితుడు రెడ్డి రమేష్‌కు, ఆయన కుటుంబానికి అండగా ఉంటూ, ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బార్నాల సీతారాం, గొర్లి వెంకటరమణ, రాగాల శ్రీను మాస్టారు, మజ్జి కృష్ణమోహన్, కొండపల్లి బాలకృష్ణ, గొర్లి మాధవ్, మజ్జి రాజా, తాళ్లపూడి సూరిబాబు, గొట్ట శివ, రాజాన రాంబాబు, ఎడ్ల త్రినాధ్, కోన లక్ష్మి, ఉత్తరావిల్లి గోవింద్ నాయుడు, మంతిని వాసుదేవరావు నాయుడు, ఎస్ఆర్‌టి నాయుడు, లోగిస గణేష్ , వలిరెడ్డి జగదీశ్, పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ అంతరాష్ట్ర రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించి డ్రింక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు పట్టుబడితే వారి వాహనాల్లో సీజ్ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు పోర్టులో ఉండేలా చూసుకోవాలని, లేకపోతే అపరాధ రుసుంలో భారీగా విధిస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి ప్రయాణాలు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని, కావున వాహనదారులు అధికారులకు సహకరించి రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి హెల్మెట్లు లేకపోవడంతో తక్షణమే వారికి హెల్మెట్ కొనుగోలు చేయించి ధరించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాహనదారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో చోరీ

63 గ్రాముల బంగారం, 1.945 కిలోల వెండి అపహరణ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేటలో రహదారి పక్కనే ఎన్ సి ఎస్ చక్కెర కర్మాగారం ఆవరణలో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. స్వామివారి బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. 63గ్రాములు బంగారం, 1.945 కిలోల వెండి వస్తువులు (స్వామివారి వివిధ రకాల ఆభరణాలు, వెండి పళ్ళెం, శటగోపం తదితర వస్తువులు) చోరీ జరిగింది. వెంకటేశ్వర స్వామివారిఆలయం ఆవరణలోగల సీతారామస్వామి ఆలయం, గోదాదేవి, శ్రీరాజ్యలక్ష్మి ఆలయాల్లో ఈ ఆభరణాలను దొంగులు ఎత్తుకుపోయారు.తలుపుల తాళాలు విరగ్గొట్టి, గెడలు తప్పించి చోరీకీ పాల్పడినట్లు తెలుస్తుంది. శనివారంనాడు కార్తీక ఏకాదశి సందర్భంగా ఆయాఆలయాల్లో బంగారు, వెండివస్తువులు అలంకరణ చేశారు.చోరీ జరిగినట్లు ఆదివారం ఉదయం సమాచారం తెలుసుకున్న వెంటనే పాలకొండ డిఎస్‌పి రాంబాబు, పార్వతీపురం రూరల్ సిఐ రంగనాథ్, బలిజిపేట ఎస్ఐ (సీతానగరం ఇంచార్జి) సింహాచలం, ఎఎస్ఐ లక్ష్మణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. శనివారం రాత్రి చోరీ జరిగినప్పటికీ ఆదివారం మధ్యాహ్నం వరకు ఆలయం అధికారులు ఫిర్యాదు ఇవ్వడానికి ముందుకు రాకపోవడం గమనార్హం. కర్మాగారం సెక్యూరిటీ ఉండే స్థలానికి కూతవేటుదూరంలోనే ఈ ఆలయాలు ఉండడం, ఇక్కడ దొంగతనం పట్ల పోలీసులు క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్ జాగిలాలు, క్లూస్ టీమ్, ఇతర టీములు విచ్చేసి దొంగతనం జరిగిన ఆలయ ప్రాంతాన్ని పరిశీలించాయి. పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు.


ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్